భూ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



మోహన్‌రావుపేట శివారులో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు

కోరుట్ల, న్యూస్‌టుడే: 63వ జాతీయ రహదారి నిర్మాణం కోసం భూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామశివారులో జాతీయ రహదారుల అథారిటీ అధికారులు చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాస్, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ వెంకటరెడ్డి, తహసీల్దార్ కిషన్, అధికారులు పాల్గొనారు.

కోరుట్ల: కోరుట్ల పట్టణం కల్లూర్‌రోడ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలోని సరకులు, కూరగాయలను పరిశీలించారు. తరగతి, వసతి గదులను పరిశీలించి మౌలిక వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యనందించాలని సూచించారు. అంతకుముందు పట్టణంలోని బిలాల్‌పురలో ఎల్ఆర్ఎస్ స్కీమ్ కింద అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ తీరును పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాస్, ఎస్సీ సాంఘిక సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, కమిషనర్ తిరుపతి, టీపీవో ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపల్ బాబు పాల్గొన్నారు.

జగిత్యాల: గురుకుల పాఠశాలలు, సంక్షేమశాఖ వసతి గృహాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని ఈ విషయమై ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళిక రూపొందించాలన్నారు. శీతాకాలం వస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు వేడి నీరు అందించేందుకు గీజర్లు ఏర్పాటు చేయాలని, అవసరమైతే సోలార్ వాటర్‌ప్లాంట్లకు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్ రెడ్డి, ఎల్.సాయిబాబా, కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

యాసంగి ప్రణాళిక సిద్ధం

3.55 లక్షల ఎకరాల్లో పంటల సాగు అంచనా


న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

జిల్లాలో యాసంగి పంటల ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. ఎస్సారెస్పీ నుంచి యాసంగికి ఆయకట్టుకు నీరందనుండగా వరదకాలువలో నిండుగా నీటిని నిల్వ చేయటం, సాధారణంకన్నా అధిక వర్షపాతం నమోదు, భూగర్భ జల మట్టం కనిష్ఠ స్థాయిలో ఉండటం, గోదావరి నుంచి ఎత్తిపోతలు చేపట్టనుండటం, చెరువులు అలుగుపారటం తదితరాల సానుకూలతలతో అన్నిపంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. ఈ యాసంగిలోనూ వరి ప్రధానపంటగా ఉండనుండగా తదుపరి మొక్కజొన్న, నువ్వులను అధికంగా సాగుచేస్తారు. ఆయిల్‌పామ్ సాగు క్రమంగా పెరుగుతోంది. అధికంగా పంటలు సాగులోకి రానుండటంతో ప్రభుత్వ హామీ మేరకు రాయితీపై యంత్రపరికరాలు, విత్తనాలను సరఫరా చేయాలి, పంటలబీమాను అమలుచేయాలి, ఎరువుల కొరత తలెత్తకుండా చూడాలి. యాసంగిలో నువ్వులు, జొన్న, సజ్జ, ఆవాలు, మక్క, వరి తదితర పంటల్లో విత్తనోత్పత్తిని చేపట్టనున్నందున కంపనీల మోసాల నుంచి రైతులను కాపాడేలా ఒప్పందసాగు చట్టాన్ని అమలు చేయాలి. మిగిలిన రైతులకు పంట రుణమాఫీ నిధులను విడుదల చేయటం, రైతుభరోసా సాయం విడుదల, లక్ష్యం మేరకు పంట రుణాల పంపిణీ తదితర చర్యలు కర్షకులకు మరింతగా దన్నుగా నిలుస్తాయి.

భూమికి అనువైన పైర్లను సాగు చేయాలి

నేలలు, నీటివసతి, మార్కెటింగ్ తదితరాలకు అనువైన పంటలను పండించాలి. గ్రామాల్లో జీరోకింద ఎలాంటి పంట ఉత్పాదకాలను కొనవద్దు, వ్యవసాయశాఖ అధీకృత డీలర్ల వద్దనే రశీదులపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలి.

- సీహెచ్.రాంచందర్, జిల్లా వ్యవసాయాధికారి



జిల్లాలో ప్రధాన పంటగా పండించనున్న వరి

జిల్లాకు కావాల్సిన ఎరువులు (టన్నుల్లో..)

ఎరువు	టన్నులు
యూరియా	39,100
డీఏపీ	16,219
పొటాష్	8,148
సూపర్	3,500
కాంప్లెక్స్	36,000

అవసరమున్న విత్తనాలు (విత్తనం / మోతాదు (క్వింటాళ్లలో))

విత్తనం	మోతాదు
వరి	75,750
మక్క	2,176
మినుము	18
పెసర	32
ఆవాలు	15
నువ్వులు	430

యాసంగిలో పంటల సాగు అంచనా పైరు విస్తీర్ణం (ఎకరాల్లో...)

వరి	మక్క	నువ్వులు	ఆయిల్‌పామ్	వేరుసెనగ	పెసర	మినుము	సెనగ	అలసంద	ఆవాలు	చెరకు
3,03,000	27,200	21,500	800	460	400	250	270	2508	300	890

ఇందిరా శక్తి.. మహిళా ఉన్నతి

న్యూస్‌టుడే, కోరుట్ల





కోరుట్లలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి సాధించడంతో పాటు వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' పథకం ప్రవేశపెట్టింది. జిల్లాలోని 18 మండలాల్లో మొత్తం 18 మండల మహిళా సమాఖ్య సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 13,818 మహిళా సంఘాలున్నాయి. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య ద్వారా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జగిత్యాల, కోరుట్ల, మల్యాలలో-2, మల్లాపూర్ ఇలా అయిదు మండల కేంద్రాల్లో ఇటీవల క్యాంటీన్లు ఏర్పాటు చేసి మహిళలు స్వయంగా నిర్వహిస్తున్నారు. దీనికితోడూ ఏడాది కిందట కలెక్టరేట్‌లో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలోనూ క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఈక్యాంటీన్లలో నాణ్యమైన పిండి వంటకాలు, తినుబండారాలతోపాటు ఆహారం, టీ, అల్పాహారం, భోజనం ఇళ్లలో వినియోగించే పరికరాలు, జ్యూట్‌బ్యాగ్‌లు, ఫ్లోర్‌క్లీనర్లు, డోర్‌కర్టెన్లు, ఇతర వస్తువులను విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వీటి ఏర్పాటు కోసం మండల మహిళా సమాఖ్య నుంచి నిధులు కేటాయించారు.

శుభకార్యాలకు సరఫరా

మహిళా శక్తి క్యాంటీన్‌లో టీ, కాఫీతోపాటు సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసిన పిండి వంటకాలు, తినుబండారాలు, ఆహారం విక్రయిస్తున్నారు. ఆర్డర్లపై నాణ్యమైన పిండి వంటలు, అల్పాహారం, భోజనం ఇలా 10-15 రకాలను తయారు చేసి సరఫరా చేస్తున్నారు. కోరుట్లలోని మహిళా క్యాంటీన్‌లో గానుగ నూనెతో తయారు చేసిన నాణ్యమైన పచ్చళ్లు అమ్ముతున్నారు. మామిడి, ఉసిరి, నిమ్మకాయ, టమాట, అల్లం, కాకరకాయ, గరుగ్గాయ, గోంగూర, పుదీన, మటన్, చికెన్, చేపల పచ్చళ్ల తయారీ ప్రత్యేకత. శుభకార్యాలయాలకు ఆహారం సరఫరా చేస్తున్నారు.

స్వయం ఉపాధి - భారతి, ఉజ్వల మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు



ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో కోరుట్లలో క్యాటీన్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడ మహిళలు స్వయంగా తయారు చేసిన పండి వంటకాలు, తినుబండరాలు, పచ్చళ్లను, ఇళ్లలో వినియోగించే పరికరాలను విక్రయిస్తున్నాం. ఈ క్యాంటీన్ నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాల సభ్యులం ముగ్గురు చూసుకుంటున్నాం. ఆర్డర్లపై సరఫరా చేస్తుండటంతో గిరాకీ బాగానే ఉంది. స్వయం ఉపాధి పొందుతున్నాం.

నాణ్యమైన తినుబండారాలు - శంకర్, ఏపీఎం



కోరుట్ల ఉజ్వల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా క్యాంటీన్‌ను ఏర్పాటు చేయించాం. ఇందులో మహిళలు నాణ్యమైన ఆయిల్, సరకులు వాడి పిండి వంటకాలు, తినుబండారాలు విక్రయిస్తున్నారు. మహిళల స్వయంగా తయారు చేసిన వాటిని క్యాంటీన్‌లో విక్రయించడంతో ఉపాధి లభిస్తుంది. ఇక్కడ తయారు చేసిన పచ్చళ్లను గల్ఫ్ దేశాలకు సైతం తీసుకెళ్తున్నారు.

ఉచిత బియ్యం
మరో నాలుగేళ్లు పొడిగింపు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం




పేదలకు అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మరో నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. కరోనా విపత్తుకు ముందు రేషన్ కార్డు దారులకు ఒక్క రూపాయికి కిలో బియ్యాన్ని అందజేశారు. కరోనా సమయంలో కేంద్రం పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయడం ప్రారంభించగా ప్రస్తుతం మరో నాలుగేళ్ల పాటు ఇవ్వాలని నిర్ణయించింది.

జిల్లాలో 6 లక్షల మంది లబ్ధిదారులు

ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ అన్న యోజనలో భాగంగా రేషన్ కార్డుదారులకు కేంద్రం బియ్యాన్ని పంపిణీ చేస్తుంది. జిల్లాలో సుమారు 3 లక్షల వరకు రేషన్ కార్డులుండగా సుమారు 6 లక్షల మంది లబ్ధిదారులున్నారు. నెలకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యాన్ని అందజేస్తున్నారు. గతంలో ఒక్క రూపాయి కిలో బియ్యాన్ని అందజేయగా కరోనా నుంచి ఉచిత పంపిణీ చేస్తున్నారు. తాజాగా కేంద్రప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీని మరో నాలుగేళ్ల పాటు అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో 6 లక్షల మందికి లబ్ధి కలగనుంది. ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేయడం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు పోషకాహార లోప నివారణకు కేంద్ర ప్రభుత్వం చౌకధరల దుకాణాల్లో అందించే బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలుపుతున్నారు. ఈ బియ్యం అనేక పోషకాల మిళితం. ఒక క్వింటాల్ బియ్యంలో ఒక కిలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలుపుతున్నారు.

ఇది.. రాజీవ్ రహదారికి ఆనుకొని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ఉన్న అనంత పద్మనాభస్వామి ఆలయానికి చెందిన భూమి. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొన్నేళ్లుగా కుట్రలు జరిగాయి. స్థానికంగా ఉన్న యువత, గ్రామస్థులు ఈ భూమిని కాపాడేందుకు ఏళ్ల తరబడి పోరాటం చేశారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎట్టకేలకు భూమికి హద్దులు నిర్ణయించాలని కోర్టు ఆదేశించింది. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్లో గుంటకు రూ.30 లక్షల దాకా ఉంటుంది. దేవుడి పేరిట రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో ఇక్కడ 10.10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు హద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మిస్తే దేవుడి మాన్యానికి రక్షణ ఉంటుంది.



ఆక్రమణలో 818 ఎకరాల ఆలయ స్థలాలు
దేవుడి భూమినీ వదలడం లే!

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు సంబంధించిన భూములు కాలక్రమేణా ఆక్రమణకు గురవుతున్నాయి. 1955-56 కాస్రా పహాణితో పోలిస్తే ఇప్పుడు రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం తగ్గింది. దేవాదాయ శాఖ అధికారులు చెప్పిన వివరాల మేరకే 818 ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఇది ధరణి పోర్టల్‌లో ఉన్న ప్రస్తుత లెక్కల ప్రకారం. కాని అనధికారికం సుమారుగా 1500 ఎకరాల వరకు ఆలయాల భూమి కబ్జా చెరలో చిక్కుకున్నట్లు సమాచారం. ఆలయ భూములను ఆనుకుని ఉన్న వారు హద్దులు చెరిపేస్తూ ఆక్రమించడం, ఆ తరువాత కోర్టులను ఆశ్రయించడంతో ఏటా కొంత భూమిని దేవాదాయ శాఖ కోల్పోతూ వస్తోంది. అధికారులు మారుతుండటం, గ్రామాల్లో ఆలయ భూములెక్కడ ఉన్నాయో స్పష్టత లేకపోవడంతో సంరక్షణ కష్టసాధ్యమవుతోంది.

జిల్లా	ఆలయాలు	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఆక్రమణ (ఎకరాల్లో)
కరీంనగర్	101	713.04	144.30
జగిత్యాల	118	1,173.34	86.29
పెద్దపల్లి	111	1,131.09	551.36
సిరిసిల్ల	93	617.18	35.01
మొత్తం	423	3635.25	818.16

ఊరూరా ఇదే తీరు..!

హుజూరాబాద్ హనుమాన్ ఆలయానికి చెందినవి 1.14 ఎకరాలు, సిరిసిల్ల వేంకటేశ్వర స్వామి ఆలయ పరిధిలో 1.15 ఎకరాలు, పెద్దపల్లి గోశాలలో 1.13 ఎకరాలు, పెద్దపల్లి సీతారామస్వామి ఆలయ పరిధిలో 8.32 ఎకరాలు, జగిత్యాల రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిధిలో 2.04 ఎకరాలు, కోరుట్ల వేంకటేశ్వరస్వామి ఆలయానివి.. 20 గుంటలు, జగిత్యాల రాంమందిర్ భూమి 19 గుంటలు, పెద్దపల్లి నర్సింహాస్వామి భూమి 13.20 ఎకరాలు, కొండగట్టు ఆలయ భూములు రెండెకరాలు.. ఇలా అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ఆలయ భూములు ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. ఇందులో చాలామంది ఆక్రమణదారులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో తిరిగి స్వాధీనం చేసుకోవడం యంత్రాంగానికి సవాలుగా మారుతోంది. కొన్ని కేసుల్లో దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పులు రావడంతో.. వీటిని సెక్షన్-84 ప్రకారం పోలీసులు, రెవెన్యూ సహకారంతో స్వాధీనపర్చుకుంటున్నారు.

స్వాధీనం చేసుకుంటాం

ఎట్టి పరిస్థితుల్లో దేవుడికి సంబంధించిన గుంట భూమిని కూడా ఆక్రమణదారులకు వదిలిపెట్టం. కచ్చితంగా స్వాధీనపర్చుకుంటాం. చాలా కేసుల్లో మా శాఖకు అనుకూలంగా తీర్పులు వస్తున్నాయి. త్వరలోనే రెవెన్యూ అధికారుల సహకారంతో సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తాం. ఇదే సమయంలో ధరణి పోర్టల్‌లో ఉన్న రికార్డుల ఆధారంగా ప్రతి జాగాను కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులకు లేఖ రాశాం.

- సుప్రియ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



అఫ్రోజ్

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎండి అఫ్రోజ్ రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు హరివరప్రసాద్ తెలిపారు. ఇటీవల హుస్నాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ వాటీబాల్ పోటీల్లో పాల్గొని సత్తాచాటాడు. ఈనెల 28 నుంచి గోదావరిఖనిలో జరగనున్న రాష్ట్ర స్థాయి వాటీబాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పీఈటీ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు అభినందించారు.



అబ్దుల్ ముజిల్

కోరుట్ల: కేరళ హైస్కూల్‌కు చెందిన అబ్దుల్ ముజిల్ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఎంఏ బారీ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో ముజిల్ ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. నవంబర్ 2న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ఏఈవోల సామూహిక సెలవు

జగిత్యాల ధరూర్‌క్యాంపు: జిల్లాలోని అయిదుగురు వ్యవసాయ విస్తరణ అధికారుల సస్పెన్షన్‌ను నిరసిస్తూ 71 క్లస్టర్ల పరిధి ఏఈవోలందరూ బుధవారం సామూహికంగా సెలవుపెట్టి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోల సస్పెన్షన్‌ను బేషరతుగా ఎత్తివేయాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా కేంద్ర ప్రభుత్వ డిజిటల్ సర్వేను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ఏఈవోల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు



చల్‌గల్ యార్డులో ధాన్యం సేకరణ కేంద్రం ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల సంఖ్యాపరంగా జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే రెండోస్థానంలో ఉందని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించే ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. జగిత్యాల చల్‌గల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనాకాగా 421 కేంద్రాల ద్వారా కొనుగోలు జరుపుతామన్నారు. జిల్లా సహకారశాఖ అధికారి మనోజ్‌కుమార్, ప్యాక్స్ అధ్యక్షుడు పి.మహిపాల్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్, ఏడీఏ తిరుపతినాయక్, ఏఎంసీ కార్యదర్శి రాజశేఖర్, ప్యాక్స్ కార్యదర్శి గాజెంగి వేణు పాల్గొన్నారు.

జగిత్యాల: వరికోతల్లో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాంబాబు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వరికోత నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. రైతులకు మేలు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ అన్నారు. జిల్లా వ్యవసాయ, పౌరసరఫరాల, సహకార, రవాణా అధికారులు సీహెచ్.రాంచంద్రం, జితేందర్‌రెడ్డి, మనోజ్, శ్రీనివాస్, పౌరసరఫరాల డీఎం జితేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల మీదుగా బస్సు వెళ్లాలని నిరసన



బస్సును అడ్డుకున్న గ్రామస్థులు

సారంగాపూర్, న్యూస్‌టుడే: ధర్మపురి నుంచి ఆరేపల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సు గ్రామాల మీదుగా వెళ్లాలంటూ బీర్‌పూర్ మండలంలోని కోమన్‌పల్లి, డొంకేశ్వర్ గ్రామస్థులు బుధవారం రహదారిపై బైఠాయించి అడ్డుకున్నారు. గతంలో గ్రామాల మీదుగా వెళుతుండేదని, కరోనా సమయంలో నిలిపివేయడంతో ఇప్పటికే పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్టీసీ అధికారులకు సమస్యను తెలిపినప్పటికీ నడపడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీపతి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుపై పట్టింపేదీ?

పుర వాహనాలపై అధికారుల నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని బల్దియా అధికారులు నిత్యం వార్డులలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. చెత్తసేకరణ వాహనాలకు నెలలు గడుస్తున్నా మరమ్మతు చేయించకపోవడంతో స్వచ్ఛ పట్టణం ఎలా సాధ్యమని ప్రజలు విమర్శిస్తున్నారు. మెట్‌పల్లి పట్టణ పరిధిలో 28 ఆటోలు, 2 టిప్పర్లు, 2 డోజర్లు, 4 ట్రాక్టర్లు, 3 ట్యాంకర్లు, 1 లాడర్ జేసీబీ ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం రెండు టిప్పర్లు, ఒక స్వీపింగ్ యంత్రం, ఒక ఆటో, ఒక ట్యాంకర్, ఒక డోజర్ వాహనాలు చెడిపోయి తుప్పుపడుతున్నాయి. ఈ విషయంపై బల్దియా కమిషనర్ మోహన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వాహనాల మరమ్మతు కోసం సంబంధిత కంపెనీల వారికి సమాచారం ఇచ్చామన్నారు. 10 రోజుల్లో అన్ని వాహనాలను వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.

ఇంజిన్ సమస్యతో డోజర్.. రూ.12 లక్షలతో కొనుగోలు చేసిన డోజర్ వాహనాన్ని ఇంజిన్ సమస్యతో మూలనపడేశారు. వాహనాన్ని పాత బల్దియా కార్యాలయ ఆవరణలో నిలిపి రెండేళ్లు గడుస్తుండగా టైర్లు, ఇతర పరికరాలు తుప్పపడుతున్నాయి.

మూలనపడి ఆరు నెలలు.. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు వార్డులలో రోడ్లను శుభ్రం చేసే స్వీపింగ్ యంత్రంతో వారానికి రెండు రోజులు రహదారులను శుభ్రం చేయిస్తున్నారు. చిన్నపాటి సమస్యతో మూలనపడి 6 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు.



రెండు టిప్పర్లు.. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు కూరగాయల మార్కెట్లో నిత్యం చెత్తను సేకరించేందుకు రెండు టిప్పర్లను కొనుగోలు చేశారు. రెండు టిప్పర్లు చెడిపోయి అయిదు నెలలు గడుస్తున్నా పట్టించుకునేవారు కరవయ్యారు.



వేరే వాహనానికి టైర్ల బిగింపు.. చెత్తసేకరణ కోసం ఏర్పాటు చేసిన ఆటో క్లచ్‌ప్లేట్లు చెడిపోయి నెల రోజులు గడుస్తోంది. ఆటో టైర్లను తొలగించి మరో దానికి బిగించడంతో ప్రస్తుతం మూలనపడి ఉంది.





జగిత్యాలలో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యం

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పురపాలక సంఘానికి చెందిన 9 స్వచ్ఛ ఆటోలను జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. ఐఎంఏ ఆధ్వర్యంలో పట్టణ పారిశుద్ధ్య కార్మికులకు ఈ నెల 27న ఆదివారం నిర్వహించే మెగా వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, కమిషనర్ చిరంజీవి, డీఈ యాదగిరి, పురపాలక మాజీ అధ్యక్షుడు గిరి నాగభూషణం, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వందనం

మక్కల కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలి

జగిత్యాల వాణిజ్యం: మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకొని క్వింటాలుకు రూ.2,225 మద్దతు ధర పొందవచ్చని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి ప్రకాశ్ పేర్కొన్నారు. జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్, మార్క్‌ఫెడ్ అధికారి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు...



నేడు ప్రపంచ పోలియో దినోత్సవం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

ఒకప్పుడు ప్రపంచాన్ని వణికించిన పోలియో మహమ్మారిని సమూలంగా తరిమి కొట్టడంలో 'రెండు చుక్కలు' కీలకమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 3.5 లక్షల పోలియో కేసులు నమోదు అవుతుండగా వైద్య ఆరోగ్య శాఖతో పాటు వివిధ వర్గాలు తీసుకున్న చర్యలతో ఒకటి రెండు దేశాల్లో మినహా ప్రపంచ వ్యాప్తంగా పోలియో మహమ్మారిని నిర్మూలించారు. పోలియో కేసులు నమోదవుతున్న దేశాల నుంచి వచ్చే ద్వారా ఇతర దేశాల్లోనూ వ్యాపించే ప్రమాదమున్నది భావించి ఏటా రెండుసార్లు అయిదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయిస్తున్నారు. అఫ్గనిస్థాన్, పాకిస్థాన్‌లో పోలియో వైరస్ ఉన్నట్లు గుర్తించగా 2022లో ఆగ్నేయ ఆఫ్రికాలో పాకిస్థాన్‌నుంచి సంక్రమించిన వైరస్‌ను గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా దీనిని అరికట్టేందుకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

■ పోలియో టీకా అభివృద్ధి చేసిన వైద్య పరిశోధక బృందానికి నాయకత్వం వహించిన జోనస్ సాల్క్ జన్మదినోత్సవం సందర్భంగా అక్టోబరు 24న ప్రపంచ పోలియో దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఒక్కో సంవత్సరం ఒక్కో నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈ సారి 'ఎ చాన్స్ ఫర్ రిఫ్లెక్షన్ అండ్ రిమైండర్ టు రీచ్ ఎవ్రీ లాస్ట్ చైల్డ్' నినాదంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళిక రూపొందించింది.

నిరంతర పర్యవేక్షణ

పోలియో వైరస్ అయిదేళ్ల లోపు చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావితం చేస్తుంది. మల, నోటి మార్గం ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. ఇది నేరుగా నాడీ వ్యవస్థలోకి ప్రవేశించి పక్షవాతానికి కారణమవుతుంది. అరుదుగా సోకే అంటువ్యాధి అయినప్పటికీ ఈ వైరస్ సోకిన దేశాలలోని కొన్ని కణాలను భారీగా దెబ్బ తీస్తుంది. పోలియో మహమ్మారిని సమూలంగా నిర్మూలించినప్పటికీ ఎప్పుడైనా వ్యాపించే ప్రమాదముందనే భావనతో ప్రపంచ వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంటూ చర్యలు చేపడుతోంది. పదిహేనేళ్ల లోపు పిల్లల్లో పక్షవాతం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వారి రక్త నమూనాలను సేకరించి పుణెలోని పరిశోధన కేంద్రానికి పంపుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏటా సుమారుగా పాతికకు పైగా ఇలాంటి నమూనాలను సేకరించి పంపించినప్పటికీ పోలియో సోకినట్లుగా నిర్ధారణ కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

నిర్లక్ష్యం వీడి అవగాహన పెంచుకోవాలి

గత కొన్నేళ్లుగా దేశంలో పోలియో కేసులు నమోదు కావడం లేదు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఈ మహమ్మారి దరిదాపుల్లోకి రాకుండా జాగ్రత్త వహించాలి. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు. ఏమాత్రం లక్షణాలు కనిపించినా వెంటనే అవసరమైన నమూనాలను సేకరించి నిర్ధారణ కోసం పంపిస్తున్నాం. - డాక్టర్ ప్రమోద్‌కుమార్, పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి



కాల్‌డేటానే కీలకం

గంగారెడ్డి హత్యకేసులో దర్యాప్తు ముమ్మరం

జగిత్యాల, జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి హత్య సంచలనం కలిగించగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు సంతోష్ లొంగిపోయినప్పటికీ హత్యకు ప్రోత్సహించింది ఎవరు అనే కోణంలో పోలీసులు సమాచారాన్ని రాబడుతున్నారు. ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్ కేసుపై ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం పోలీసులు సీన్ ఆఫ్ అఫెన్స్ నిర్వహించారు. విచారణలో నిందితుడు తాను ఒక్కడినే నేరం చేశానని ఒప్పుకున్నప్పటికీ కాల్‌డేటా ఆధారంగా ఇంకా ఎవరి ప్రమేయం ఉన్నది అనే కోణంలో పోలీసులు దృష్టి సారించారు. కాల్‌డేటాలో దాదాపు 25 మందికిపైగా గుర్తించినట్లు తెలుస్తుండగా అందులో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్న వ్యక్తుల నంబర్లలో ఉన్న వారిని విచారించే అవకాశం ఉంది. బుధవారం సాయంత్రం వరకు నిందితుడు సంతోష్ తప్ప ఎవరిని అదుపులోకి తీసుకోలేదని పోలీసులు తెలిపారు. ఈ కేసు సంచలనం కలిగించటంతో పోలీసు ఉన్నతాధికారులు సైతం ప్రత్యేక దృష్టి సారించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

విషాదంలో జాబితాపూర్....

నిత్యం గ్రామంలో అందరితో కలిసి తిరిగే మారు గంగారెడ్డి మృతితో ఆయన స్వగ్రామం జాబితాపూర్‌లో విషాదం నెలకొంది. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి కేసు దర్యాప్తుపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. సన్నిహితులు, బంధువులు మరణను జీర్ణించుకోలేకపోతున్నారు. మంత్రి శ్రీధర్ బాబు సైతం హత్య ఘటనపై విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని గాంధీభవన్ నుంచి ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డితోనూ మంత్రి మాట్లాడి పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జీవన్‌రెడ్డి


నిందితుడి వెనుక ఉన్నది ఎవరు?

నిందితుడు సంతోష్ ఒక్కడే ఈ హత్య చేశాడా? అతని వెనుక ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. జాబియాగా తిరిగే సంతోష్‌కు ఇంత ధైర్యం ఎలా వచ్చిందని కూడా గంగారెడ్డి సన్నిహితులు పేర్కొంటున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు సైతం గ్రామంలో కొందరు అనుమానితులపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. నిందితుడి కాల్‌డేటాలో కుటుంబ సభ్యులు అనుమానిస్తున్న వ్యక్తుల ఫోన్ నంబర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారిని సైతం విచారిస్తే అసలు నిజం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. నిందితుడిని ఎంత విచారించినా తాను ఒక్కడినే చేశాను... ఇందులో ఎవరి పాత్ర లేదని చెబుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. నిందితుడు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకొని కత్తిని సైతం రికవరీ చేసినట్లు సమాచారం. మరికొంత మందిని అదుపులోకి తీసుకొని విచారించే అవకాశం ఉంది. గ్రామంలో బుధవారం కొందరు అనుమానితులను పోలీసులు విచారించారు.

మెకానిక్ నుంచి సినిమాల వైపు


సినిమా, వెబ్ సిరీస్ దర్శకుడిగా రాణిస్తున్న కోరుట్ల వాసి

కోరుట్ల, న్యూస్‌టుడే: మెకానిక్ నుంచి దర్శకత్వం వైపు మళ్లి.. సినిమా, వెబ్ సిరీస్ దర్శకుడిగా రాణిస్తున్నారు కోరుట్ల పట్టణానికి చెందిన ముల్క గగన్ గోపాల్. మధ్య తరగతి కుటుంబానికి చెందిన గగన్ గోపాల్ ముంబయిలో ద్విచక్ర వాహన మెకానిక్‌లో శిక్షణ పొంది 1992 నుంచి 2007 వరకు కోరుట్ల పట్టణంలో మెకానిక్‌గా పనిచేశారు. సినిమాల పట్ల ఉన్న ఆసక్తితో 2008లో హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో 6 నెలలపాటు శిక్షణ పొందారు. 2009 నుంచి 2013 వరకు ఎనిమిది సినిమాలకు దర్శకత్వ పర్యవేక్షకుడిగా పనిచేశారు. 2018లో ప్రముఖ తెలుగు నటుడు కమల్ కామరాజు హీరోగా 'లా' అనే సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్, దర్శకుడిగా వ్యవహరించారు. కరోనా వల్ల సినిమాలకు కొంత విరామం వచ్చినా 2023లో మొదలుపెట్టిన 'అండర్ వరల్డ్ బిలియనీర్స్' అనే వెబ్‌సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ఇందులో బాలీవుడ్, తెలుగు, తమిళ, కన్నడ, మళయాళంకు చెందిన ప్రముఖ నటులు నటించారు. దీనిని అయిదు భాషలలో ఒక్కో ఎపిసోడ్ 30 నిమిషాల చొప్పున మొత్తం 12 ఎపిసోడ్‌లుగా చిత్రీకరించగా ప్రస్తుతం చివరి దశలో ఉంది. 'లా' అనే సినిమాకు స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైలాగ్‌లు అందించి మొదటిసారి దర్శకత్వం వహించానని ప్రస్తుతం 'అండర్ వరల్డ్ బిలియనీర్స్' అనే వెబ్ సిరీస్‌కు దర్శకత్వంతోపాటు స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైలాగ్‌లు రాశానని అయిదు భాషల్లో విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు గగన్ గోపాల్ తెలిపారు.



లా సినిమా చిత్రీకరణలో కమల్ కామరాజుకు సీన్‌ను వివరిస్తున్న గగన్ గోపాల్

విద్యార్థుల సమాచార నిధి... అపార్



న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

ఇటీవల వరదలు సంభవించినప్పుడు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలన్నీ వరదపాలయ్యాయి. తిరిగి వాటిని పొందేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వారి ధ్రువీకరణ పత్రాలతో పాటు విద్యావిషయక పురోగతిని డిజి లాకర్‌లో భద్రపరచుకునేలా ప్రభుత్వం 'అపార్' రూపొందించింది. విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్)లో భద్రపరచనున్నారు. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి జీవితకాలం ఉపయోగపడే 12 అంకెల గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. దీని ఆధారంగా విద్యార్థుల సమగ్ర వివరాలను 'అపార్'లో నమోదు చేస్తారు. ఈ నెంబరుతో పాటు క్యూఆర్ కోడ్‌తో ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డు జారీ చేస్తారు. ఈ నెంబరు ఆధారంగా విద్యార్థులు ఎక్కడినుంచైనా వారి ధ్రువీకరణ పత్రాలను పొందే వీలుంటుంది. ఆయా అంశాలకు సంబంధించి పురోగతిని ఆయా పాఠశాలల నిర్వాహకులు ఎప్పటికప్పుడు అపార్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులు వేరే విద్యా సంస్థల్లోకి మారినప్పుడు, ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు ఈ వ్యవస్థ సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచుతుంది.

తల్లిదండ్రుల సమ్మతి తప్పనిసరి

పాఠశాల విద్యార్థులు మైనర్లు కావడంతో చట్ట, నైతిక ప్రమాణాలను, వ్యక్తిగత సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమ్మతి అవసరం. 'అపార్' ఐడీని రూపొందించేందుకు తల్లిదండ్రుల అనుమతి కోరుతూ సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అనుమతి పత్రాలను సేకరిస్తున్నారు. ఇటీవల జరిగిన పోషకుల సమావేశంలో 'అపార్'పై అవగాహన కల్పించి అనుమతి పత్రాలను తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన అనుమతి పత్రాలను పాఠశాలలో భద్రపరిచి దాని డిజిటల్ కాపీని పాఠశాల సమన్వయకర్త ద్వారా యుడైస్ ప్లస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు.



వెబ్‌సైట్ హోమ్‌పేజీ

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
జగిత్యాల	1,165	1,59,585
కరీంనగర్	1,071	1,57,648
పెద్దపల్లి	784	98,240
సిరిసిల్ల	659	87,390

భవిష్యత్తులో కీలకం

విద్యార్థులకు భవిష్యత్తులో 'అపార్' కీలకం కానుంది. తల్లిదండ్రులు తమ సమ్మతి పత్రాలను ప్రధానోపాధ్యాయులకు అందజేయాలి. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. ఆయా వివరాల నమోదుపై ఇప్పటికే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తూ సమ్మతి పత్రాలను తీసుకునేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. **- బి.సుదర్శన్‌రెడ్డి, సమన్వయకర్త, రామగుండం**

జాతీయ స్థాయిలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇప్పటికే 'యుడైస్ ప్లస్' సైట్‌లో వివరాలు నమోదు చేశారు. వాటి అనుగుణంగా 'అపార్' కార్డు కోసం ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రత్యేకతలు... ప్రయోజనాలు

ఐడీ వచ్చిన తరువాత ధ్రువీకరణ కోసం తల్లిదండ్రులు నమోదు చేసుకున్న ఫోన్‌నెంబరుకు నిర్ధారణ కోసం ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయగానే ఆన్‌లైన్‌లో 'అపార్' గుర్తింపు కార్డు జారీ చేస్తారు. విద్యార్థి బ్యాంకు ఖాతా వివరాలతో ఇది అనుసంధానమవుతుంది. విద్యార్థి ప్రవేశ పరీక్షలు, ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ సమయంలో ఇది కీలకం కానుంది.

గుర్తింపు కార్డు నమూనా →



రైల్వే అభివృద్ధి ప్రతిపాదనలపై నేడు సమావేశం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి ప్రతిపాదనలపై చర్చించేందుకు గురువారం అధికారులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నారు. ద.మ.రై. జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మన రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు పలు పనులను ప్రతిపాదించనున్నారు. వీటిలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి విశాఖ-శిర్డీ మధ్య నడిచే సాయినగర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను పెద్దపల్లి, నిజామాబాద్ మీదుగా మళ్లించడం, కాచిగూడ-కరీంనగర్ మధ్య నడిచే డెమోను పెద్దపల్లి వరకు పొడిగించడం, జగిత్యాలలోని లింగంపేట రైల్వే ప్లాట్‌ఫాంను విస్తరించడంతో పాటు పెద్దపల్లి, నిజామాబాద్ రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేయాలనే ప్రతిపాదనలున్నాయి.

నాణ్యమైన పత్తికే సీసీఐ మద్దతు ధర

ఆర్‌జేడీఎం శ్రీనివాస్

జమ్మికుంట, న్యూస్‌టుడే: నాణ్యమైన పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చి ప్రభుత్వ కనీస మద్దతు ధరను పొందాలని వరంగల్ ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు(ఆర్‌జేడీఎం) శ్రీనివాస్ సూచించారు. బుధవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌డీడీఎం పద్మావతి, కరీంనగర్ డీఎంవో ప్రకాష్, ఆర్డీవో రమేశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. మొదటిరోజు ఓ రైతు విక్రయానికి తీసుకు వచ్చిన ట్రాక్టర్ పత్తికి క్వింటాలు రూ.7,270.37 చొప్పున సీసీఐ బాధ్యులు చంద్రశేఖర్ ఖరీదు చేశారు.

8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే..: ఆర్‌జేడీఎం మాట్లాడుతూ. . మద్దతు ధర పొందేందుకు నాణ్యమైన, నాణ్యతలేని పత్తిని వేర్వేరుగా విక్రయానికి తీసుకురావాలన్నారు. నాణ్యతను బట్టి 8 శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే సీసీఐ రూ.7,521 నుంచి రూ.7,220.16 దాకా చెల్లిస్తుందన్నారు. నీళ్లు చల్లి, రంగుల మారిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదనే విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌తోపాటు స్థానిక ఏడు జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటిఫై చేసిందన్నారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం, రాజా, అడ్తి వ్యాపారుల సంఘం అధ్యక్షులు రాజేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


■ బుధవారం ఒక్కరోజే యార్డుకు 223 ట్రాలీల విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో విడిపత్తి కనిష్ఠ ధర రూ. 6 వేల నుంచి రూ.7 వేల దాకా పలికింది. మంగళవారం కంటే తాజాగా రూ.200 పెరిగింది.



పత్తి కొనుగోలును ప్రారంభిస్తున్న వరంగల్ ఆర్‌జేడీఎం శ్రీనివాస్

ఎమ్మెల్యే గంగులకు పరామర్శ

రాంపూర్ (కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి లక్ష్మీనర్సమ్మ మృతిచెందడంతో పలువురు బుధవారం కరీంనగర్‌లో గంగుల కమలాకర్‌ను పరామర్శించారు. వీరిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు టి.హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కౌశిక్‌రెడ్డి, సత్యం, ఎంపీ వి.రవిచంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రవిశంకర్, రామకృష్ణారెడ్డి, మేయర్ వై.సునీల్‌రావు, భారాస జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు ఉన్నారు. లక్ష్మీనర్సమ్మ అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు.



లక్ష్మీనర్సమ్మ భౌతికకాయం వద్ద మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తదితరులు

అధిక ధరలకు విక్రయం..

రూ.లక్షల్లో అక్రమం

వెండర్ల స్టాంపు పేపర్ల బాగోతం

న్యూస్‌టుడే, కరీంనగర్ సంక్షేమ విభాగం

స్టాంపు పేపర్లు అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు కొందరు స్టాంప్ వెండర్లు. రిజిస్ట్రేషన్ శాఖలో క్రయవిక్రయాలు జరిపేందుకు స్టాంపు పేపర్లు అవసరమవుతాయి. వివిధ పనుల కోసం ఉద్యోగులకు... నూతన ఉద్యోగాలలో చేరడానికి నిరుద్యోగులకు, ఉన్నత చదువు నిమిత్తం విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాలలో స్టాంపు పేపర్లు కావాల్సి ఉంటుంది. తెలిసిన వారు వెళ్తే 100 స్టాంపు కాగితం రూ.120, తెలియని వారు వెళ్తే అదే స్టాంపు కాగితం రూ.150 వరకు విక్రయిస్తున్నారు. తీసుకుంటే తీసుకోండి లేదంటే మీ ఇష్టం.. అనే సమాధానం వస్తుందని పలువురు కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఈ తతంగం అంతా ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో జరగడంలేదు. అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల సమీపంలోని కొందరు గదులు అద్దెకు తీసుకొని అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. ఈవిషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఏటా 50 లక్షలకు పైగా సరఫరా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 14 రిజిస్ట్రేషన్ కార్యాలయాలున్నాయి. ఏటా ప్రధాన కార్యాలయం నుంచి కరీంనగర్ ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయానికి 50 లక్షలకు పైగానే స్టాంపు పేపర్లు వస్తున్నాయి. వీటన్నింటిని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందజేస్తారు. వారు లైసెన్సు పొందిన స్టాంప్ వెండర్లకు అందజేస్తారు. అధికారులు వచ్చిన వాటిని స్టాంప్ వెండర్లకు అందించడం వరకే బాధ్యత తీసుకుంటున్నారు. అనంతరం వారు ఎంతకు విక్రయిస్తున్నారు. నిబంధనలు ఏంటని అటు వైపు చూడటమే మానేశారు.

చూస్తే చిల్లరే.. లెక్కిస్తే భారీ మొత్తం

ఎంత ధర ఉంటే అంతకే విక్రయించాలని నిబంధనలున్నా వాటిని తుంగలో తొక్కుతున్నారు. దాదాపు ప్రతి పనికి స్టాంపు పేపర్లు అత్యంత కీలకం. వివిధ రకాల ఒప్పందాలకు, వాహన క్రయవిక్రయాలకు, అప్పులకు చాలా అవసరం. వారికి ఉన్న అత్యవసర పరిస్థితిని ఆసరా చేసుకొని ఎక్కువగా విక్రయిస్తున్నారు. అధిక ధరకు విక్రయించేవారు ప్రతి రోజు దాదాపు 50కిపైగా విక్రయిస్తున్నారు. ఒక్కో దానిపై రూ.50 అధికంగా తీసుకున్నా రోజుకు రూ.2500 వరకు వస్తుంది. ప్రభుత్వం 5 శాతం కమీషన్ ఇస్తోంది. అక్రమ సంపాదనకు మరిగిన కొందరూ అందినకాడికి దండుకుంటున్నారు. ప్రతి వెండర్ అక్రమంగా నెలకు రూ.50,000 వరకు ఆర్జిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వంద మంది ఉన్నా.. రూ.50 లక్షల వరకు ప్రజలపై భారం పడుతోంది.



కూత వేటుదూరంలో ఉన్నా చూడరా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతోపాటు అన్నీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో స్టాంప్ వెండర్ల దుకాణాలున్నాయి. అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తే అన్నీ విషయాలు తెలుస్తాయి. అయితే వారు ఇప్పటివరకు తనిఖీ చేసిన సందర్భాలు లేవు. చాలామంది బహిరంగంగానే స్టాంపు కాగితాలు అధిక ధరకు తీసుకుంటున్నారని ఆరోపించినా.. ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 మందికిపైగా స్టాంప్ వెండర్లు ఉంటే అందులో దాదాపు అధిక మంది ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల అంత ఒక్కటై విక్రయిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే లైసెన్సు రద్దు



వెండర్లు నిబంధనల ప్రకారం ఉన్న ధరకే స్టాంపు కాగితాలు విక్రయించాలి. ఎవరికైనా అధికంగా విక్రయిస్తే సమీపంలోని అధికారుల దృష్టికి తీసుకురావాలి. విచారణ చేసి వారి లైసెన్సులు రద్దు చేస్తాం. మొదట ప్రజలు ప్రశ్నించే దృక్పథం అలవాటు చేసుకోవాలి.

- ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

వేములవాడలో చిన్నారి విక్రయం కలకలం

పోలీసులకు తల్లి ఫిర్యాదు



బిడ్డతో శ్యామల

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలో ఓ చిన్నారి విక్రయం కలకలం రేపింది. భిక్షాటన చేసే ఓ మహిళ తాగిన మైకంలో పది నెలల పాప మేఘనను మరో మహిళకు విక్రయించి, తిరిగి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డిపేటకు చెందిన శ్యామల, రవీందర్ దంపతులు గత కొంత కాలంగా వేములవాడలో నివాసం ఉంటున్నారు. రాజన్న ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఐదుగురు సంతానం కావడంతో చిన్నపాపను విక్రయించాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని గతంలో తమకు పరిచయం ఉన్న జగిత్యాల జిల్లా గోవింద్‌పల్లెకు చెందిన లక్ష్మికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో వేములవాడ వచ్చిన లక్ష్మితో పాటు శ్యామల కుటుంబ సభ్యులు మంగళవారం తిప్పాపూర్‌లో మద్యం తాగారు. తాగిన మైకంలో రూ.90 వేలకు లక్ష్మికి విక్రయించారు. స్టాంప్ పేపరుపై రాయించి ఇచ్చారు. బుధవారం తన పాపను లక్ష్మి అపహరించిందని శ్యామల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. తనకు రూ.90 వేలకు విక్రయించారని లక్ష్మి తెలిపింది. ఆమె వద్ద ఉన్న బాలికను తిరిగి శ్యామలకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు.

4 నుంచి ఎల్‌ఎల్‌ఎం పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే ఎల్‌ఎల్‌ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 4 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు కూడా అదే రోజు నుంచి మొదలవుతాయని.. ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 6 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, రాయికల్

సమస్య: రాయికల్-చెర్లకొండాపూర్ పెద్ద చెరువు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది? చెరువు కట్ట మరమ్మతు చేపట్టాలి? **- లక్ష్మీనారాయణ, చెర్లాకొండాపూర్**

సమాధానం: రాయికల్ పెద్ద చెరువు కట్టను పరిశీలించి కోతకు గురైన ప్రాంతాలను గుర్తించి మరమ్మతు చేపడతాం. **- భాస్కర్, డీఈ, ఇరిగేషన్**

రైతు సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్



వేంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నర్సింగరావు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలం వేంపేటలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం అధ్యక్షుడు కొమిరెడ్డి తిరుపతితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహకార సంఘం ఉపాధ్యక్షుడు సుర్కంటి సంజీవ్‌రెడ్డి, జెట్టి లింగం, అల్లూరి మహేందర్‌రెడ్డి, ఆకుల లింగారెడ్డి, ఏనుగు బుచ్చిరెడ్డి, తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి న్యాయమూర్తికి సన్మానం

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి సబ్‌కోర్టు ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా పనిచేసి బదిలీ అయిన కె.ప్రసాద్‌ను బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎన్.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొంది న్యాయసేవలు అందించాలని ఆకాంక్షించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన సీనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులకు ఎదురైన సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. మెట్‌పల్లి, కోరుట్ల న్యాయవాదుల సంఘం సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో వెంకటేశ్వర్లు

ధర్మపురి, న్యూస్‌టుడే: ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని, జగిత్యాల డీఐఈవో డా.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి రోజు ఇంటర్ విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. బోధనాభ్యసన ప్రక్రియలతో పాటు, సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడా ప్రాంగణం ఇలా... ఆటలు ఆడేదెలా..!

గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు చాలా చోట్ల కేవలం బోర్డుల ఏర్పాటుకే పరిమితమయ్యాయి. కథ్లాపూర్‌పేటలో పశు వైద్య శాలను ఆనుకుని ఉన్న స్థలంలో ఇలా క్రీడా ప్రాంగణం బోర్డు ఏర్పాటు చేసి స్తంభాలు వేసి వదిలేశారు. మైదానం చదునుగా లేక ఖాళీ ప్రోత్సాహం లేకపోయినా క్రీడాకారులు ఉత్సాహంగా ఇలా ఆటలు ఆడుకుంటున్నారు. మరింత సౌకర్యవంతంగా వీటిని అభివృద్ధి చేస్తే గ్రామీణ క్రీడాకారులకు ఆశించిన ప్రయోజనం నెరవేరనుంది. **- న్యూస్‌టుడే, వెల్గటూరు**

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మల్లాపూర్: మల్లాపూర్ మండలంలోని రేగుంట నుంచి ధర్మారం వరకు ప్రత్యేక మరమ్మతు దృష్ట్యా గురువారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రేగుంట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి

మెట్‌పల్లి పట్టణం: పట్టణంలోని 20వ వార్డు స్వయంభూ హనుమాన్ ఆలయం ముందు నిర్మిస్తున్న నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బల్దియా కమిషనర్ మోహన్‌కు వినతిపత్రం అందించారు. బొడ్ల రమేష్, నవీన్, బొడ్ల నగేష్, నరేష్, విజయ్, రమేష్‌యాదవ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





ప్రతిభ చాటి... బహుమతి సాధించి

'ఈనాడు' ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని శ్రీనిధి హైస్కూలు విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'సెల్‌ఫోన్లలో అంతర్జాల వాడకం, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిమూడు స్థానాల్లో నిలిచిన ఎం.హిరణ్యరావు, ఆర్.అజయ్, ఎ.అక్షరశ్రీలకు హెచ్‌ఎం మేఘమాల బహుమతులు అందించారు. రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

నిర్మాణాలకు అంచనాలు రూపొందించండి



చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే డా.సంజయ్

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల అధికారులతో బుధవారం ఎమ్మెల్యే డా.సంజయ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణాలకు అంచనాలు రూపొందించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఎంపీడీవోలు రామకృష్ణ, చంద్రశేఖర్, జగదీశ్, కోరుట్ల, మెట్‌పల్లి డీఈలు రాంరెడ్డి, సత్యనారాయణ, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

మెట్‌పల్లి పట్టణం: రాష్ట్రంలో అన్ని వర్గాల వారిని ఆదుకునేందుకే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని, వాటిని అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి(వెంకట్రావుపేట) పెద్ద చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో వంద శాతం రాయితీతో అందిస్తున్న సుమారు 60 వేల చేపపిల్లలను చెరువులో వదిలారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను గంగపుత్రులు సన్మానించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకుచ్చారు. పుర ఛైర్‌పర్సన్ రాణవేని సుజాత, మత్స్యశాఖ జిల్లా అధికారిణి విజయభారతి, మత్స్యశాఖ జిల్లా ఛైర్మన్ పల్లికొండ ప్రవీణ్, కమిషనర్ మోహన్, వైస్‌ఛైర్మన్ చంద్రశేఖర్‌రావు, పర్రె శంకర్, నర్సయ్య, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న మెట్‌పల్లి పట్టణానికి చెందిన మార్గం భూదేవికి మంజూరైన రూ.1.50 లక్షలు, ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన బి.సాయికుమార్‌కు రూ.2 లక్షల ఎల్వోసీ పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం అందజేశారు. బకాయి ఉన్న బిల్లులు ఇప్పించాలని మెట్‌పల్లి మున్సిపల్ కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

కోరుట్ల: కోరుట్ల క్యాంపు కార్యాలయంలో బుధవారం 42 మందికి రూ.10,92,500 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ పంపిణీ చేశారు. మోహన్‌రెడ్డి, బట్టు సునీల్, ఫయిమ్, సజ్జు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ మండలం ముత్యంపేటలో మృతిచెందిన వాకిటి గంగవ్వతో పాటు పలువురు బాధిత కుటుంబసభ్యులను బుధవారం ఎమ్మెల్యే సంజయ్ పరామర్శించారు. భారాస నాయకులు గౌరు నాగేష్ పాల్గొన్నారు.



నిందితులతో డీఎస్పీ, సీఐ

అన్నను హత్య చేసిన
తమ్ముళ్ల అరెస్ట్

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: అన్నను హత్య చేసిన కేసులో ఇద్దరు తమ్ముళ్లతో పాటు సహకరించిన మరొకరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మెట్‌పల్లిలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించారు. మల్లాపూర్ మండలం ఒబులాపూర్‌కు చెందిన పల్లెపు సాయిలు(36)కు తమ్ముళ్లు పల్లెపు చిన్ని, పల్లెపు చందులతో ఇంటి స్థలం, అదే గ్రామానికి చెందిన గొల్ల సోమయ్యతో పొలం విషయంలో కొంతకాలంగా పలుమార్లు గొడవలు జరిగాయి. ఆ సమయంలో మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో పాటు చిన్ని, చందులను పోలీసులు బైండోవర్ చేశారు. ఈ క్రమంలో సాయిలుపై ఇద్దరు తమ్ముళ్లతో పాటు సోమయ్య కక్ష పెంచుకొని హత్య చేయాలని అదును కోసం వేచి చూస్తున్నారు. ఈ నెల 20న సాయిలు ఒబులాపూర్ గోదావరి వంతెన వద్ద ఉండడాన్ని చూసిన సోమయ్య మిగిలిన ఇద్దరికి సమాచారమిచ్చాడు. అప్పటికే మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చిన తల్వారుతో సాయిలు ఉన్న ప్రదేశానికి ఇరువురు చేరుకున్నారు. మెడపై తల్వారుతో ఇద్దరు కలిసి దాడి చేయడంతో సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ముగ్గురు కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై పారిపోయారు. సంఘటనపై కేసు నమోదు చేసిన సీఐ నిరంజన్‌రెడ్డి, మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ నిందితుల కోసం గాలిస్తుండగా బుధవారం మల్లాపూర్ కనకసోమేశ్వర ఆలయం వద్ద పట్టుకున్నారు. వారి వద్ద తల్వారు, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ, ఎస్సైని ఆయన అభినందించారు. మెట్‌పల్లి ఎస్సైలు చిరంజీవి, రాజు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

పోలీసుల అదుపులో చిట్టీల వ్యాపారి

జగిత్యాల: జగిత్యాల గోవిందుపల్లికి చెందిన ఓ చిట్టీల వ్యాపారిని బుధవారం జగిత్యాల పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గతంలో సుమారు 50 మంది నుంచి రూ.4 కోట్ల మేరకు వసూలు చేసి ఉడాయించగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అతన్ని అదుపులోకి తీసుకుని బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

చిలుకను హింసించారని జరిమానా

జగిత్యాల ధరూర్‌క్యాంపు: రామచిలుకను బంధించి పంచాంగం వీడియో చిత్రీకరించి యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రసారం చేయటంపై కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన ఎ.గౌతం జగిత్యాల జిల్లా అటవీ శాఖ అధికారికి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును పరిశీలించి బాధ్యులైన వ్యక్తులపై కేసు నమోదుచేసి విచారించినట్లు రేంజి అధికారి పద్మారావు తెలిపారు. బాధ్యులు రాజు, గంగవ్వ వీడియోను రెండు సంవత్సరాల కిందట తీసినట్లుగా అంగీకరించి తమకు తప్పు అనే విషయం తెలియక రామచిలుకతో వీడియో చేశామని చెప్పారన్నారు. మొదటితప్పుగా భావించి రూ.25 వేల జరిమానా విధించినట్లు రేంజి అధికారి పేర్కొన్నారు.

వన్యప్రాణి మాంసం విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు

రాయికల్, న్యూస్‌టుడే: రాయికల్ మండలం వడ్డెలింగాపూర్ గ్రామ శివారులో వన్యప్రాణి(అడవి పంది) మాంసం విక్రయిస్తున్న అల్లెపు గంగనర్సయ్య పట్టుకుని అటవీ అధికారులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సెక్షన్ అధికారి మల్లయ్య, బీట్ అధికారి రత్నాకర్, వసీం తదితరులున్నారు.



పొలాస జడ్పీ హైస్కూలులో పూర్వవిద్యార్థులు



మోహన్‌రావుపేట పాఠశాలలో..

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

జగిత్యాల వాణిజ్యం: జగిత్యాల మండలం పొలాస జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. తమకు విద్యనేర్పిన ఉపాధ్యాయులు సూరజ్ శివశంకర్, జనార్ధన్, లింగయ్య, వెంకటాచారి, రమేశ్, నాగలక్ష్మిలను సన్మానించారు. మృతిచెందిన తమ సహచరుడి కుటుంబానికి రూ.50 వేలు అందించారు. రాజేశ్, రాజ్‌కుమార్, రాజమల్లు, రవి, శ్రీధర్, గంగారెడ్డి, నరేశ్, సురేశ్, రాధ, లక్ష్మి, రజిత, సునిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం మోహన్‌రావుపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అశోక్, చిన్నన్న, రాజు, సురేశ్, నాగరాజు, వెంకటేశ్, సత్తన్న, సత్యనారాయణ, శ్రీనివాస్, శేఖర్, లక్ష్మి రాజం, కిరణ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



శిలాఫలకంవద్ద ఎమ్మెల్యే, పుర అధ్యక్షురాలు, అధికారులు

జగిత్యాల ధరూర్ క్యాంపు: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాలలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రూ.5 కోట్ల నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని బుధవారం ప్రారంభించారు. రూ.1.08 కోట్లతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, ప్రిన్సిపల్ రామకృష్ణ, ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్, విద్యాశాఖ ఈఈ అనితసింగ్, సీపీడీసీ సభ్యులు శ్రీలత, ఖాన్‌జియా, రోటరీక్లబ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

హత్యను రాజకీయం చేయటం సరికాదు : ఎమ్మెల్యే

జగిత్యాల గ్రామీణం : జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు మారు గంగారెడ్డి హత్యను ఖండిస్తున్నానని.. రాజకీయం చేయటం సరికాదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. హత్యపై పోలీసుల విచారణ జరుగుతుందన్నారు. గంగారెడ్డి హత్యకు తనకు సంబంధం లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మాత్రమే కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు.

గురుకులాల ఏర్పాటులో మార్పులు చేపట్టాలి

రాయికల్ పట్టణం, రాయికల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సమీకృత గురుకులాల్లో కులాలు, మతాల ప్రతిపాదన లేకుండా అన్ని వర్గాలు, మతాల విద్యార్థులందరూ ఒకే పాఠశాలలో విద్యనభ్యసించే విధంగా మార్పులు చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. రాయికల్ పట్టణం, మండలంలోని అల్లీపూర్, ఆలూర్, కిష్టంపేట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. టీపీటీఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోగ రమేష్, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాంచంద్రం, సుధాకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

పోషకాహారలోప చిన్నారులను గుర్తించండి

మల్యాల, న్యూస్‌టుడే: గ్రామాల్లో పోషకాహారలోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక చికిత్సతోపాటు ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి పౌష్టికాహారాన్ని అందజేసేలా చూడాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మల్యాల ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు జిల్లాలో 1900 మంది టీబీ వ్యాధిగ్రస్థులను గుర్తించి చికిత్స అందజేస్తున్నామని, టీ-హబ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 35 వేల మంది రోగులకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ తరగతులు

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షకుడు రాంరాజ్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణలో ప్రతి రైతు నుంచి ఆధార్, పట్టదారు పాసు పుస్తకం జిరాక్స్‌ను తీసకుని పుస్తకంలో నమోదు చేసుకోవాలన్నారు. ఏపీఎం వోదెల గంగాధర్, సీసీలు రవీందర్, విద్యాసాగర్, మరియా, గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారి భూసేకరణ పూర్తి చేయాలి



తాటిపల్లిలో సర్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల గ్రామీణం: జాతీయ రహదారి 63 నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ పనులను అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. జగిత్యాల గ్రామీణ మండలంలోని తాటిపల్లి, కోరుట్ల మండలం మోహన్‌రావుపేటలో జాతీయ రహదారి అధికారులతో కలిసి బుధవారం సర్వేను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. కోరుట్ల ఆర్డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



దారిని కప్పేసిన చెట్లపొదలు

సారంగాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపల్లె నుంచి రంగపేట వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, చెట్ల పొదలతో మూసుకుపోయింది. మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనం కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సారంగాపూర్, ధర్మపురి నుంచి రాయికల్ వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించేలా చూడాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సారంగాపూర్

సంక్షిప్తం

రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టాలని నిరసన

కోరుట్ల : కోరుట్ల నియోజకవర్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు వెంటనే నిర్మించాలంటూ బుధవారం తెదేపా ఆధ్వర్యంలో కోరుట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల పంట రుణమాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కిషన్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రవీణ్‌కుమార్, మోహన్, మహదేవ్, మహేశ్, మారుతి, గణేశ్, విజయ్, రఫియోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

బీటులో దినుసుల కొనుగోలు

జగిత్యాల వ్యవసాయం: జగిత్యాల వ్యవసాయ మార్కెట్లో బుధవారం మక్కలకు క్వింటాలుకు రూ.1,850-2,435 ధర పలికింది. ఎంటీయూ1010 రకం ధాన్యం రూ.1,895-1,926, నువ్వులకు రూ.10,560-10,700 ధరలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు.

ఎస్సారెస్పీకి 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు 39,446 క్యూసెక్కుల వరద వస్తుండగా 8 స్పిల్‌వే గేట్ల ద్వారా 24,992 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్లద్వారా 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరదకాలువకు 5 వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, ఇతర కాలువలు, ఎత్తిపోతలకు కలుపుకొని ఇన్‌ఫ్లోతో సమానంగా ఔట్‌ఫ్లోను అధికారులు కొనసాగిస్తున్నారు.

రైతు రుణమాఫీ అమలులో విఫలం

కొడిమ్యాల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు నాటికి రైతు రుణమాఫీ పూర్తిచేస్తామని చెప్పి, అమలు చేయడంలో విఫలమయ్యారని భాజపా మండలాధ్యక్షులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి అన్నారు. భాజపా మండలశాఖ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఏలేటి నర్సింహారెడ్డి, కోలకాని సాయిబాబ, బండ నర్సింహారెడ్డి, అంకం పద్మ, బైరి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

అనవసర విమర్శలు చేస్తే సహించం

కొడిమ్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల అమలుపై, ఎమ్మెల్యేపై భాజపా నాయకులు అనవసర విమర్శలు చేస్తే సహించబోమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలువేరి నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులు సమావేశం నిర్వహించారు. నాగభూషన్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు చంద్రమోహన్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్, గోల్కొండ రాజు, ఎన్.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్రచికిత్సలు

మెట్‌పల్లి పట్టణం: మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 40 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయించినట్లు అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ తెలిపారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో మూడు రోజు కిందట ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారిని కరీంనగర్ రేకుర్తి ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించి స్వగ్రామానికి తరలించారు. కార్యదర్శి రాకేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన నాగుల రాజేశం-సుజాత దంపతులు, కుటుంబ సభ్యులు రూ.30,016 ఆర్థిక సహకారాన్ని ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. అర్చకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను నియమించండి

జగిత్యాల : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయిన్‌పల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించిందని ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నియామకానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

భాజపా సభ్యత్వ నమోదు

మల్యాల: ప్రతి బూత్‌లో 200 మందికి భాజపా సభ్యత్వం నమోదు చేయించాలని కరీంనగర్ జిల్లా భాజపా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మల్యాల మండలంలో పార్టీ సభ్యత్వ నమోదు తీరును పరిశీలించారు. జాడి బాల్‌రెడ్డి, పెరక శ్రవణ్, గాజుల మల్లేశం, రవి, తిరుపతి, మల్లేశంయాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలో బుధవారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీన పర్చుకున్నారు. మద్యం తాగి వాహనం నడిపే వారిపై కేసులు నమోదు చేశారు. ఆర్ఎస్సై మల్లేష్ తదితరులున్నారు.

పోరండ్లలో పశు వైద్యశిబిరం

జగిత్యాల వ్యవసాయం: జగిత్యాల మండలం పోరండ్లలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధినిరోధక టీకాలను ఇచ్చారు. కల్లెడ పశువైద్యాధికారిణి డాక్టర్ హిమజ, లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్, రాజేశ్, గంగాధర్, ప్రవీణ్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి కిరీటి, కారోబార్ రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

రాయికల్ పట్టణం: రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా ఈనెల 27న జగిత్యాలలో నిర్వహించనున్న ధర్మయుద్ధ మహాసభలో మాదిగ సామాజిక వర్గీయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ కోరారు. పట్టణంలో కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. వేణుగోపాల్, నర్సయ్య, బాలరాజు, సురేష్, అజయ్, గణేష్, సుమంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ సర్వేయర్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్‌పై ఉచిత శిక్షణ

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని నూకపల్లి సమీపంలో ఉన్న న్యాక్ సెంటర్‌లో ల్యాండ్ సర్వేయర్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ సహాయ సంచాలకులు రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న యువకులు దరఖాస్తు చేసుకోవాలని, 3 నెలలపాటు ఉచిత శిక్షణ, వసతి, భోజనం ఉంటుందన్నారు. వివరాలకు 99859 93168లో సంప్రదించాలని కోరారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశాలు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ గునుక శ్రీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ ఎంపీసీ, ఎంఎస్‌టీసీఎస్, బీజడ్‌సీ, ఎంజడ్‌సీ, బీసీఎఫ్, ఎస్‌క్యూసీ, బీకాం, సీఏలో ప్రవేశాలు పొందవచ్చని ప్రతి గ్రూపులో 40 మందికి అవకాశముంటుందన్నారు. వివరాలకు 86393 65500, 90003 64889లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కొండగట్టులో ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు ఆలయంలో అటెండరుగా పనిచేసే బక్కయ్య అనే వ్యక్తి బుధవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. ఆలయంలో దీర్ఘకాలంగా ఉంటున్న ఓ భక్తురాలితో జరిగిన గొడవ కారణంగా పురుగు మందు తాగినట్లు తెలిసింది. బక్కయ్యను మెరుగైన చికిత్స కోసం వరంగల్ తరలించినట్లు సమాచారం. ఈ విషయమై ఈవో రామకృష్ణారావును సంప్రదించగా ఓ భక్తురాలితో జరిగిన గొడవ కారణంగా బక్కయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డట్లు తెలిసిందని, పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని వెల్లడించారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి

మల్యాల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోవడంతో యువత తీవ్ర నిరుత్సాహం చెందుతోందని, వైద్య, విద్య, వ్యవసాయ రంగాలను సంస్కరిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఏర్పడతాయని డాక్టర్ బీఎన్.రావు అన్నారు. బుధవారం మల్యాల మండలం నూకపల్లిలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం బీఎన్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓటును ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయడానికి వీలుగా దరఖాస్తులను అందజేశారు.